క్లుప్తంగా...

బీఎస్పీ సనత్‌నగర్ అధ్యక్షుడిగా అఖిలేష్



బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధ్యక్షుడిగా జి.అఖిలేష్ నియమిస్తూ జిల్లా అధ్యక్షులు సునీల్ ఉత్తర్వులు జారీ చేశారు. బోయిగూడ ప్రాంతానికి చెందిన అఖిలేష్ ఇంజినీరింగ్ పూర్తిచేసి బహుజన ఉద్యమంలో కీలకంగా పని చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ సనత్‌నగర్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా అఖిలేష్ మాట్లాడుతూ.. బహుజనులకు రాజ్యాధికారం ద్వారానే అట్టడుగు వర్గాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారన్నారు. విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న అట్టడుగు వర్గాలు రాజకీయపరంగా మైనార్టీలు మిగిలిపోవడం దురదృష్టకరమన్నారు.

నేడు లాలాపేటలో ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని నఫీజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి శారదా మల్లేష్, ఎస్సీ మోర్చా కన్వీనర్ ఏ. శంకర్రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమ్మేళనానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డా. లక్ష్మణ్, ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

తెలంగాణ వచ్చాకే పండగలకు ప్రాముఖ్యం

రాంగోపాల్‌పేట్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తర్వాతనే మన సంస్కృతిని చాటే పండుగలకు ప్రాముఖ్యత పెరిగిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం రాత్రి సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయం వద్ద నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పండుగలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెబుతాయని అందుకే వాటికి మన ప్రభుత్వం ఎంతో వైభవంగా నిర్వహిస్తోందన్నారు. బతుకమ్మ ఉత్సవాలకు విశ్వవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. అందమైన బతుకమ్మలతో వందలాది మంది మహిళలు వచ్చి ఆటాపాటలతో అలరించారు. మహిళల బతుకమ్మ ఉత్సవాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, కిరణ్మయి, కస్తూరి, లావాణ్య, పుష్ప, రూసీ, నిర్మల పాల్గొన్నారు.

రైల్వే కేంద్రీయ ఆసుపత్రిలో జీఎం తనిఖీలు


సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శనివారం లాలాగూడలోని రైల్వే కేంద్రీయ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఇతర సీనియర్ వైద్యులతో కలిసి వివిధ విభాగాలు, వార్డులను తనిఖీ చేస్తూ రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అందుతున్న వైద్యం, మందులు, తదితర సదుపాయాల గురించి మాట్లాడారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి గురించి, చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి డాక్టర్లు, అధికారులతో చర్చించారు.

బీఆర్‌ఎస్ ఓటమికి ప్రచారం చేస్తాం



ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమికి 40 రోజులు ప్రచారం చేయనున్నట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా విద్య, నిరుద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించిన బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, పార్టీ ఓటమికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో నరేష్, లెనిన్, నెల్లి సత్య, భగత్, రాజు, సుమన్, అరుణ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



సికింద్రాబాద్: రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఈ నెల 19న సుమారు 30–35 ఏళ్ల మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి ప్లాట్‌ఫాం నెం–2లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతుండగా కాలు జారి కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. రైల్వే పోలీసులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు.

అమ్మ కోసమే..

- మెరుగైన సేవలందిస్తున్న దుండిగల్‌లోని 'అరుంధతి' ఆస్పత్రి
- బిల్లు కౌంటర్ సైతం లేనివైనం
- అమ్మకిచ్చిన మాట కోసమే అంటున్న మర్రి రాజశేఖర్ రెడ్డి



కంటోన్మెంట్: కార్పొరేట్ వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిన రోజులివి.. ఏ చిన్నపాటి వైద్యానికైనా లక్షల్లో బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ఆసుపత్రిలో చేరితే చాలు రకరకాల టెస్టులు చేయించుకోవాల్సిందే. ఆయా టెస్టుల రిపోర్టులు వచ్చేదాకా ఆసుపత్రి బిల్లు చెల్లిస్తూ ఉండాల్సిందే.. ఈ నేపథ్యంలో అడపదడపా కొన్ని ఆసుపత్రులు నామమాత్రపు ఫీజులతో వైద్యం అందిస్తూ తమ సేవాభావాన్ని చాటుకుంటున్నాయి. అత్యాధునిక సదుపాయాలతో పూర్తిస్థాయి మల్టీ స్పెషాలిటీ వైద్యం పూర్తిగా ఉచితంగా అందిస్తోంది దుండిగల్‌లోని అరుంధతి ఆసుపత్రి.

అధునాతన వైద్య పరికరాలతో..

మర్రి రాజశేఖర్ రెడ్డి.. నగర వాసులకు పరిచయం అక్కర్లేని పేరు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి బీఆర్‌ఎస్ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజారిటీ ఓటమి చెందినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. అంతకు ముందే ఎమ్మెల్లార్ గ్రూపు ఆధ్వర్యంలో పలు ఇంజినీరింగ్ కాలేజీలు, స్కూళ్లను విజయవంతం కొనసాగిస్తున్నారు.. ఇదే క్రమంలో రెండేళ్ల క్రితం మెడికల్ కాలేజీ స్థాపనకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా వైద్య కళాశాలకు అనుబంధంగా ఏర్పాటు చేసే ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలు ఉంచాల్సిన అవసరం ఏమీ లేదు. అయినప్పటికీ కోట్లాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు సమకూర్చారు.



పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

తల్లిమాటతో..



తన తల్లి అరుంధతి పేరిట మెడికల్ కాలేజీ నెలకొల్పాలని నిర్ణయించుకుని ఆమెతో చెప్పగా.. తన పేరు మీద పెట్టే ఆసుపత్రిలో పేదలకు ఉచితంగా వైద్యం అందించాలంటూ మాట తీసుకుందని రాజశేఖర్ రెడ్డి చెప్పారు. వెంటనే సరే అని చెప్పినప్పటికీ ఆసుపత్రి నిర్వహణ భారం గురించి ఆలోచించసాగారు. తన కాలేజీ ప్రాంగణంలోని ఓ భవన సముదాయాన్ని ఆసుపత్రిగా మార్చేశారు. వైద్య కళాశాల నిబంధనల మేరకు అవసరమైన సదుపాయాలతో పాటు, పూర్తిస్థాయి కార్పొరేట్ ఆసుపత్రికి కావాల్సిన సదుపాయాలు కూడా సమకూర్చారు. భగవంతుడు తనకు శక్తినిచ్చినంత కాలం ఈ ఉచిత వైద్యాన్ని కొనసాగిస్తానని అంటున్నారు మర్రి రాజశేఖర్ రెడ్డి.

కంటోన్మెంట్ కాంగిరేసులో ఎవరో?

- అధిష్టానంపై వెన్నెల అసంతృప్తి
- మళ్లీ మొదటికొచ్చిన టికెట్ పోరు



వెన్నెల



శ్రీగణేశ్



సర్వే సత్యనారాయణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ రేసు రోజుకో మలుపు తిరుగుతోంది. దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెలకు దాదాపు టికెట్ ఖరారైందంటూ ప్రచారం సాగుతుండటంతో ఆమె క్షేత్రస్థాయిలోనూ పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ఇంతలోనే అధిష్ఠానం తనకు స్పందించడం లేదంటూ వెన్నెల ఏకంగా విలేకరుల సమావేశంలో పేర్కొనడం గమనార్హం. దీంతో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న నేతలు తమ వంతు ప్రయత్నాలను మరింత తీవ్రం చేశారు. తమ అభ్యర్థి ఎవరో తేల్చకుండా అధిష్ఠానం తాత్సారం చేస్తుండటం పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీసారి కొత్త అభ్యర్థి

నియోజకవర్గం పునర్విభజన జరిగిన 2009 నుంచి ప్రతీసారి కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మారుతూ వచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన శంకర్రావుకు 2014లో పార్టీ టికెట్ దక్కలేదు. ప్రజాసంఘాల కన్వీనర్‌గా కొనసాగుతూ వచ్చిన గజ్జెల కాంతంకు టికెట్ ఇచ్చారు. ఓటమి అనంతరం ఆయన కంటోన్మెంట్‌లో కనిపించలేదు. 2018లో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణకు టికెట్ కేటాయించారు. ఓటమి అనంతరం ఆయన సైతం నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే కంటోన్మెంట్ కాంగ్రెస్ క్యాడర్‌కు ఓ పెద్ద దిక్కులేకుండా పోయింది. తీరా ఎన్నికలు సమీపిస్తున్న వేళ పదుల సంఖ్యలో నేతలు కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే టికెట్ కోసం దరఖాస్తు కూడా చేసుకోని గద్దర్ కుమార్తె వెన్నెలకు టికెట్ ఇస్తారనే ప్రచారం కొనసాగింది. గత వారం శ్రీగణేశ్ కాంగ్రెస్‌లో చేరడంతో కొత్త సమీకరణలు తెరపైకి వచ్చాయి. దీంతో వెన్నెల క్షేత్రస్థాయి పర్యటనలు ప్రారంభించారు. ఇంతలోనే ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అధిష్ఠానం తీరుపై అసంతృప్తిని వెల్లడి చేయడంతో, కాంగ్రెస్‌లో టికెట్ రేసు మళ్లీ మొదటికొచ్చిందని ఆ పార్టీ కార్యకర్తలు గొనుక్కుంటున్నారు. ఇక ఇప్పటికే టికెట్ ప్రయత్నాల్లో ఉన్న జీవకన్, నర్సింహన్ వంటి నేతలు తమ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



వేదస్వస్తి పారాయణం చేస్తున్న ఋత్వికులు

చిలకలగూడ: శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఏడవ రోజైన శనివారం పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి ఉత్సవమూర్తులకు ముత్యపు కవచాలంకరణ నిర్వహించి, వేదస్వస్తి తోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని గజవాహనంపై ఊరేగించారు. ఆదివారం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిస్తారని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ వేణు గోపాలరావు కోరారు. టీపీ బాలాసుబ్రమణియన్, జనార్దన్ ఆధ్వర్యంలో మృదంగ లయవిన్యాస జుగల్‌బందీ ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయ ప్రతినిధులు బాలభాస్కర్, లక్ష్మీనారాయణ, ఆత్మరామసూర్య సుబ్రహ్మణ్యం, శివశంకరన్, నారాయణన్, రామచందర్, సుజయ్ ప్రకాశ్, అర్చకులు, భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓయూలో పూలే విగ్రహం ఏర్పాటుకు ఆమోదం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పాలక మండలి (ఈసీ) ఆమోద ముద్ర వేసినట్లు తెలిసింది. ఈ నెల 20న జరిగిన పాలక మండలి సమావేశంలో అనేక అంశాలను చర్చించి ఆమోదించారు. గతంలో ప్రారంభించిన భవనాలు, ఇతర నిర్మాణ పనులు కొనసాగుతాయని కొత్తగా చేపట్టనున్న బైపాస్ రోడ్డు, లేడీస్ హాస్టల్‌తో పాటు ఇతర నూతన పనులను ఎన్నికల అనంతరం ప్రారంభించాలని ఈసీ నిర్ణయించినట్లు సమాచారం. ఎస్ఈ దేవిదాస్ ఆరు నెలల సస్పెన్షన్‌పై సమయం ముగిసినా తిరిగి విధుల్లోకి చేర్చుకునే అంశం చర్చకు రాలేదని తెలిసింది.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

లాలాపేట: ఆరు నెలలకోసారి హెచ్ఐవీ ఎయిడ్స్ పరీక్ష తప్పని సరిగా చేసుకోవాలని నాకో ప్రాజెక్టు డైరెక్టర్ అచ్యుత అన్నారు. లాలాపేట విజయ డెయిరీ వద్ద నాకో, ఏపి సాక్స్ సహకారంతో శ్రీసాయి మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా హెచ్ఐవీ ఎయిడ్స్ ర్యాపిడ్ పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్ఐవీ ఎయిడ్స్ అనేది కేవలం సెక్స్ కార్యకలాపాల ద్వారానే కాకుండా ట్యాటూ వేసుకోవడం, రక్తమార్పిడి, సూదిమందు సిరెంజిలతో, క్షౌ రశాలలో వాడే బ్లేడ్స్ వంటి వాటితో వచ్చే అవకాశం ఉంటుందన్నారు. గత నెల 600 మందికి పరీక్షలు చేయగా 12 మందికి పాజిటివ్ రాగా వారిని చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రజలు హెచ్ఐవీ ఎయిడ్స్ టెస్టులపై అపోహలు వీడి నిర్భయంగా పరీక్ష చేసుకోవాలన్నారు.

సికింద్రాబాద్ పీజీ కాలేజీకి లేడీస్ హాస్టల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో మొదటి సారీ ఏర్పాటు చేసిన లేడీస్ హాస్టల్‌ను ఈ విద్యా సంవత్సరం నుంచి వసతి కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.రవికుమార్ తెలిపారు. శనివారం వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ హాస్టల్ భవనంలో దసరా సందర్భంగా పూజలు చేసినట్లు వివరించారు. కళాశాలలోని తరగతి గదుల భవనాన్ని హాస్టల్‌గా మార్చినట్లు ప్రిన్సిపల్ చెప్పారు. పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదవుతున్న 200 మంది విద్యార్థినులకు దసరా సెలవుల అనంతరం ఈ నెల 26 నుంచి వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు.



సుబ్బరాజు దంపతులకు సన్మానం



కొండ్రాజు సుబ్బరాజును సన్మానించిన బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు

సనత్‌నగర్: జెక్‌కాలనీకి వన్నె తీసుకువచ్చేలా ఎంతో ఆకర్షణీయంగా ఆర్చిని నిర్మించిన గ్రీన్‌సిటీ అధినేత కొండ్రాజు సుబ్బరాజు, రమణమ్మ దంపతులను బతుకమ్మ ఉత్సవ కమిటీ ఘనంగా సన్మానించింది. ఆయన చేస్తున్న సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. కాలనీలో మునుపెన్నడూ లేనివిధంగా ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాలు ఎంతో వైభవంగా జరగడం తమకెంతో ఆనందంగా ఉందని బ్యాంక్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి పూర్మానీ మల్లారెడ్డి తెలిపారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శిగా హోదాలో సమర్థవంతమైన బాధ్యతలు చేపట్టడం ద్వారా కాలనీ మహిళలను ఒకే తాటిపైకి తీసుకువచ్చారన్నారు. మహిళలంతా ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని సంప్రదాయ బతుకమ్మ పండుగకు మరింత శోభను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, ఉపాధ్యక్షులు ఆదిలక్ష్మీదేవి, కేవీ రమణమ్మ,భాగ్యలత, విజయలక్ష్మీ, వాణి పాల్గొన్నారు.

దుర్గమ్మా.. దీవించమ్మా



సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలోపూర్వ కమిటీ సభ్యుల పూజలు

సనత్‌నగర్: దేవీ నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. అమ్మవారిని రోజుకొక అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. ఆయా ఉత్సవ కమిటీ ప్రతినిధులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసి కనువిందు చేస్తున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక అర్చనలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి.



రేణుకానగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి



కట్టమైసమ్మ ఆలయంలో పూజల్లో సుభాష్‌ముదిరాజ్



లాలాపేట భగవతి పోచమ్మ దేవాలయంలో..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అన్నానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న లాస్యనందిత

రసూల్‌పురా: సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామని కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత హామీ ఇచ్చారు. రెండవ వార్డు పార్టీ ఇన్‌చార్జి టీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఆమె అన్నానగర్, అర్జున్‌నగర్, సీబీఎన్ నగర్, నాగమ్మ టెంపుల్ లైన్, బీరప్ప టెంపుల్ గల్లీ, ఇందిరమ్మనగర్ తదితర బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మినీ ఇండియాగా ప్రసిద్ధి చెందిన కంటోన్మెంట్ నియోజకవర్గంలో భిన్న మతాలు, భాషలు, కులాల వారు ఉన్నారని అందరికి అండగా ఉంటామన్నారు. తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న తరహా ప్రజలందరికి అందుబాటులో ఉంటూ స్థానికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని మాటిచ్చారు. ప్రచారంలో నివేదిత, కుమార్, దేవులపల్లి శ్రీనివాస్, నరేష్, ధన్‌రాజ్, అంజనేయులు, నర్సింహా, శ్యాం రెడ్డి, మహేష్, జంగిల్ రాజు, అబ్బు, జిలానీ, శ్రీను పాల్గొన్నారు.

సనత్‌నగర్ కాంగ్రెస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలి

ప్లకార్డులతో మహిళల నిరసన

పద్మారావునగర్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమాకు సొంత పార్టీ నుంచి వ్యతిరేకత మొదలైంది. శనివారం బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు, సానుభూతిపరులు ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. సనత్‌నగర్ కాంగ్రెస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలని.. ఏళ్లతరబడి నుంచి పార్టీని నమ్ముకున్న వారికి మోసం చేయరాదు.. ఢీల్లీ క్యాండిడేట్స్ మాకు వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్థానికులకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఇప్పటికైనా అధిష్ఠానం సనత్‌నగర్ టికెట్ విషయంలో పునరాలోచన చేయాలని కోరారు. అయితే టికెట్ రాని అభ్యర్థులు తెర వెనుక ఉండి ఈ తతంగాన్ని నడిపించారని కొంత మంది మహిళలను తీసుకొచ్చి అంతకు ముందే తాము వేసుకున్న పథకం ప్రకారం ఈ ఆందోళన కార్యక్రమాన్ని నడిపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



ప్రచారం చేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీతాఫల్‌మండి డివిజన్‌లో శనివారం ఆయన పాదయాత్రను నిర్వహించారు. నామాలగుండు, ఉప్పరి బస్తీ, బ్రాహ్మణ బస్తీ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. కేవలం ఎన్నికలు, ఓట్ల కోసం కాకుండా ప్రజలు కరోనా రోజుల్లో ఇబ్బంది పడ్డ దశలో తమ వ్యక్తిగత సాయం అందించామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా తాము విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో అశ్వాపురం వేణుమాధవ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, బీఆర్‌ఎస్ నేతలు కిషోర్, రామేశ్వర్, కిరణ్, త్రినేత్ర, నేతలు కరాటే రాజు, కంది నారాయణ పాల్గొన్నారు.

ముంపు సమస్యకు చెక్ పెట్టిన ఘనత బీఆర్‌ఎస్‌దే



మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నాలుగైదు దశాబ్దాల పాటు సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన నేతలు, నాటి ప్రభుత్వాలు పట్టించుకోని బేగంపేట వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే అని మంత్రి తలసాని పేర్కొన్నారు. బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ, వడ్డెరబస్తీ, బ్రాహ్మణవాడీ ప్రాంతాల్లో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే ఎస్ఎన్‌డీపీ కింద రూ.45 కోట్ల వ్యయంతో నాలా పూర్తిస్థాయి అభివృద్ధి పనులు చేపట్టి ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించామన్నారు. ఖబ్రస్థాన్ కోసం స్థలం కేటాయించాలని స్థానిక ముస్లింలు గత 30 సంవత్సరాల నుంచి కోరుతున్నా గత పాలకులు పట్టించుకోలేదని తమ హయాంలో రెండెకరాల స్థలం కేటాయించడంతో పాటు రూ.3 కోట్లతో నిర్మాణం చేపట్టినట్లు గుర్తు చేశారు. మంత్రి వెంట సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్ కిరణ్మయి, నాయకులు శ్రీహరి, డీవీ నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్, అఖిల్ అహ్మద్, అక్బర్, సలీంఖాన్ ఉన్నారు. సనత్‌నగర్ డివిజన్ మహిళామోర్చా అధ్యక్షురాలు సరితాగౌడ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

తండ్రి కోసం తనయుడి ప్రచారం



ప్రచారం చేస్తున్న సాయికిరణ్‌యాదవ్

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు మద్దతుగా ఆయన తనయుడు సాయికిరణ్‌యాదవ్ విస్తృతంగా ప్రచారం చేశారు. శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి తన తండ్రిని గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు వారిని నమ్మే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సాయికిరణ్ యాదవ్ పేర్కొన్నారు.

దాండియా.. దిల్ జీత్‌లియా



సనత్‌నగర్/రసూల్‌పురా: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బేగంపేటలోని కంట్రీక్లబ్‌లో 'మహా నవ రాత్రి ఉత్సవ్ 2023' జోష్‌ఫుల్‌గా ఆరంభమైంది. మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ వేడుకలో సంప్రదాయ గర్బాడ్యాన్స్‌లతో పాటు ఉత్సాహాన్ని నింపే లైవ్ డీజే, ధోల్, లైవ్ మ్యూజిక్, లైవ్ సింగింగ్ ప్రదర్శనలు హుషారెక్కించాయి. దాండియా డ్యాన్స్ ఫ్లోర్‌పై యువత డ్యాన్స్‌లతో సరదాగా గడిపారు. కంట్రీ క్లబ్ సీఎండీ రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ పండుగలకు ఆసియాలోనే విభిన్నమైన వేడుకలను నిర్వహించడం తమ ప్రత్యేకత అన్నారు.సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నిర్వహిస్తున్న హునార్ మహోత్సవ్ ప్రదర్శనలో దేవీ నవరాత్రులను పురస్కరించుకుని శనివారం దాండియా కార్యక్రమం నిర్వహించారు.

బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న బండా కార్తీకరెడ్డి

బౌద్ధనగర్/ఉస్మానియా యూనివర్సిటీ/పద్మారావునగర్: బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రంగురంగుల పువ్వులతో అందంగా బతుకమ్మలను పేర్చి మహిళా ప్రజాప్రతినిధులు, యువతులు, బాలికలు బతుకమ్మ ఆడుతూ సందడి చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379